ఫెవికాల్ వీరులకు స్థానచలనం!

- శ్రీశైల దేవస్థానంలో పలు విభాగాల్లో తిష్ట వేసిన ఉద్యోగులు
- కమిషనర్ ఉత్తర్వులతో ఉద్యోగుల అంతర్గత బదిలీలు
- ఏకంగా ఒకేసారి 42మందిని బదిలీ చేసిన ఈఓ
- కాంట్రాక్ట్ ఉద్యోగుల స్థానాల మార్పునకు కసరత్తు


శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పనిచేసే ఉద్యోగులు ఆయా విభాగాల్లో చాలా కాలంగా తిష్ట వేసి ఫెవికాల్‌వీరులుగా మారారు. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు దేవదాయశాఖ కమిషనర్ రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాల్లో పనిచేసే ఉద్యోగులను ప్రతి మూడు నెలలకు ఒకసారి అంతర్గత బదిలీలు చేయాలని ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీశైల దేవస్థానంలో ఏకంగా 42 మంది రెగ్యులర్ ఉద్యోగులను ఈఓ అంతర్గత బదిలీ చేశారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరి బదిలీలు ఉంటాయని స్పష్టం చేశారు. దీంతో ఫెవికాల్‌వీరులకు చెక్ పడినట్లయ్యింది.

300 మందికి పైగా ఉద్యోగులు

శ్రీశైల దేవస్థానంలో సుమారు 300 మందిపైగా రెగ్యులర్ ఉద్యోగులు, వెయ్యికి పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, వివిధ ఏజెన్సీల ద్వారా పనిచేసే ఉద్యోగులు ఉన్నారు. శ్రీశైల దేవస్థానంలో ఆలయం, వసతి, ఎస్టాబ్లిష్‌మెంట్, రెవెన్యూ, శానిటేషన్, అన్నదానం, అడ్మినిస్ట్రేషన్, ప్రచురణలు, ప్రజాసంబంధాలు, ఇంజినీరింగ్ తదితర ముఖ్యమైన విభాగాలు ఉన్నాయి. ఆయా విభాగాల కింద లడ్డూ తయారీ, గోశాల, లడ్డూ విక్రయాలు, కళ్యాణకట్ట, నీటిపారుదల, సెక్యూరిటీ, ప్రొటోకాల్, ఎలక్ట్రికల్, కౌంటర్ల నిర్వహణ తదితర ఉప విభాగాలు ఉన్నాయి. వీటిలో ఏఈవో స్థాయి నుంచి పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, కౌంటర్ విధులు, అటెండర్లు, వాచ్‌మెన్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

అన్ని విభాగాల్లో పట్టు సాధించేలా..

రాష్ట్ర దేవదాయశాఖ రాష్ట్రంలోని 6(ఏ) ఆలయాల్లో సిబ్బంది విధి విధానాల్లో మార్పు తీసుకువచ్చేందుకు, వారికి అన్ని విభాగాల్లో పట్టు సాధించేలా ప్రతి ఉద్యోగిని మూడు నెలలకు ఒకసారి అంతర్గత బదిలీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జూన్ 22న కమిషనర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసి మూడు నెలలకు ఒకసారి అంతర్గత బదిలీలు అనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

42 మంది రెగ్యులర్ ఉద్యోగుల స్థానాల మార్పు

శ్రీశైల దేవస్థానంలో పలు విభాగాల్లో ఏఈవో స్థాయి నుంచి అటెండర్ స్థాయి వరకు అంతర్గత బదిలీలు సైతం లేకుండా తిష్టవేసి ఉన్నారు. అయితే ఇకపై సంవత్సరాల తరబడి ఒకచోట పాతుకుపోయిన ఉద్యోగులను సైతం బదిలీ చేస్తున్నారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు గత కొన్ని రోజుల క్రితం రెగ్యులర్ ఉద్యోగులను దేవస్థాన ఈఓ ఎస్.లవన్న ఒకేసారి 42మందిని అంతర్గత బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఇతర ఉద్యోగులను సైతం త్వరలో అంతర్గత బదిలీలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

ప్రతి మూడునెలలకు ఒకసారి అంతర్గత బదిలీలు తప్పనిసరి



శ్రీశైల దేవస్థానంలో ఆయా విభాగాల్లో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రతి మూడు నెలలకు ఒకసారి అంతర్గత బదిలీలు తప్పనిసరిగా చేస్తాం. దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేస్తాం. అలాగే అంతర్గత బదిలీలు లేని ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కూడా రొటేషన్ పద్ధతిలో డ్యూటీలు వేస్తాం. పారదర్శకత, జవాబుదారీతనం పెరిగేందుకు, ఉద్యోగులు కూడా అన్ని విభాగాల్లో పట్టుసాధించేందుకు ఈ బదిలీలు చేస్తున్నాం. – ఎస్.లవన్న, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

క్లుప్తంగా

ఓటర్ల జాబితాను పూర్తిగా పరిశీలిస్తాం


మాట్లాడుతున్న ఈఆర్‌ఓ వెంకటశివ

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాను పూర్తిగా పరిశీలిస్తామని ఈఆర్‌ఓ వెంకటశివ తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీల కార్యకర్తలతో ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లజాబితాలో ఒకే కుటుంబంలో అధికంగా ఉన్న ఓట్లను ప్రస్తుతం గ్రామాల్లో, పట్టణంలో లేనివారిని గుర్తిస్తామని, మార్పుల చేర్పులకు అవకాశం ఉందన్నారు. కాగా, వివిధ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో లిఖిత పూర్వకంగా తమకు ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. ఇంటింటి సర్వే నిర్వహించి బోగస్ లేకుండా నిజమైన ఓటర్లను గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సుల్తాన్, వరాల్‌మాలిక్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ప్రముఖుల పరామర్శ

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామ సర్పంచ్ కూరాకుల రాజేశ్వరి కుటుంబాన్ని మంగళవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. సర్పంచ్ భర్త తిక్కస్వామి(43) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరిరెడ్డి, పగిడ్యాల సింగిల్‌విండో మాజీ చైర్మన్, గ్రామ మాజీ సర్పంచ్ కట్టుబడి శ్రీనివాసులునాయుడు, మాజీ ఎంపీటీసీ పాలూరు వెంకటేశ్వర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పులేంద్రనాయుడు, ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, ఎంపీటీసీలు కట్టుబడి జయంతి, మండ్ల చంద్రమోహన్‌నాయుడు, సచివాలయ ఉద్యోగులు, పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు.

గద్దర్‌ను కోల్పోవడం బాధాకరం


గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు: పేదల గొంతుక వినిపించిన ఉద్యమకారుడు గద్దర్‌ను కోల్పోవడం బాధాకరమని మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్దర్‌ను యువత ఆదర్శంగా తీసుకొని పేదల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పుల్లన్న, మధు, డాక్టర్ వెంకటేష్, రవికుమార్, సుబ్బయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సూచనలు చేస్తున్న ఆత్మకూరు సీఐ నాగభూషణం

పాములపాడు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు సీఐ కే నాగభూషణం సూచించారు. మంగళవారం పాములపాడు పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా ఆధార్ నెంబరు, బ్యాంక్ అకౌంట్ నెంబరు, ఓటీపీ లాంటి నంబర్లను అడిగితే సమాచారం ఇవ్వకూడదన్నారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్న తక్షణమే పోలీసు వారికి తెలియజేయాలన్నారు. గ్రామాలలో రైతుల మోటార్లు, కరెంటు వైర్ల దొంగతనాలు జరుగుతున్నాయని బానకచర్ల వలంటీర్ సీఐ దృష్టికి తేవడంతో స్పందించిన సీఐ బీట్ కానిస్టేబుల్ ఏర్పాటు చేస్తామన్నారు.

మతోన్మాదాన్ని వ్యతిరేకించండి

వెలుగోడు: బీజేపీ మతోన్మాదాన్ని వ్యతిరేకించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాస్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు వి నాగమోహన్ అధ్యక్షతన నిర్వహించిన ర్యాలీ స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి పీఎస్‌ఆర్ సెంటర్ వరకు సాగింది. ఈనెల 9న మోదీ హటావో దేశ్ బచావో అనే నినాదంతో నిర్వహించబోతున్న కార్మిక, కర్షక ప్రదర్శనలను జయప్రదం చేయాలని రామదాస్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర బాషా, నూరుల్లా, ఆంజనేయులు, మదార్ వలి తదితరులు పాల్గొన్నారు.

13 ఎకరాల్లో పంటను దున్నేసిన రైతు


ట్రాక్టర్‌తో మొక్కజొన్న, అంతర పంట కంది పైరును దున్నేస్తున్న దృశ్యం

పాములపాడు: ఖరీఫ్ ప్రారంభం నుంచి దోబూచులాడిన వరుణుడు వారం రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిపించినా రైతుకు అనుకూలంగా లేని పరిస్థితి. మండలంలోని చెలిమిల్ల గ్రామ పోలిమేరలో పాములపాడుకు చెందిన రైతు నాగేశ్వరరెడ్డి 13 ఎకరాల్లో మొక్కజొన్న, అంతర పంటగా కంది సాగు చేశాడు. ఎకరాకు దాదాపు పంట సాగుకు ఇప్పటికి రూ.10వేలు ఖర్చు చేశాడు. నెల రోజుల పైరు సాధారణంగా మోకాలి పైన ఎత్తు పెరగాల్సి ఉంది. అయితే ప్రస్తుతం మొక్కజొన్న పైరు అడుగు ఎత్తు కూడా పెరగలేదు. దీంతో పెట్టుబడి కూడా చేతికందే అవకాశం ఉండదు. అలాగే అంతర పంటగా సాగు చేసిన కంది దాదాపు 4 ఎకరాల్లో ఉంటుంది. ఆ పైరు పరిస్థితి కూడా అంతే. పైగా ఎర్రబడిపోతోంది. దీంతో ఆ రైతు ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నేశాడు. చూడటానికి మొక్కజొన్నపైరు పచ్చగా కళకళలాడుతున్నప్పటికీ పెరుగుదల లేకపోవడంతో దున్నేశానని రైతు వాపోయాడు.

సాగులో మెలకువలు పాటించాలి


రైతులకు సూచనలిస్తున్న సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు

మిడుతూరు: సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కడుమూరు, మాసపేట గ్రామాల్లో ఆత్మ ఆధ్వర్యంలో జీవన ఎరువులు – జీవ సంబంధ పురుగు మందులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులు పురుగుల నివారణకు విచక్షణా రహితంగా రసాయన మందులు వాడటంతో పురుగులు నిరోధక శక్తిని పెంచుకుంటాయని, అంతే కాక పంటల మీద మందుల అవశేషాలు మిగిలిపోతాయని తెలిపారు. దీంతో వాతావరణం, పర్యావరణం కూడా దెబ్బతింటుందన్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరుగుతాయన్నారు. రైతులు జీవన ఎరువులు వేసుకోవాలని, పురుగుల మందులకు ప్రత్యామ్నాయంగా జీవసంబంధ పురుగు మందులను వాడాలని సూచించారు. అదే విధంగా పత్తి, మొక్కజొన్న, మిరప, ఉల్లి తదితర పంటలలో తెగుళ్ల నివారణోపాయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నంద్యాల ఏడీఏ మంజువాణి, ఆత్మా బీటీఎం ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ

పగిడ్యాల: స్థానిక 9వ వార్డు మెంబర్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో మంగళవారం స్థానిక సచివాలయం–1లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంఈఓ సుభాన్ (స్టేజీ–1) ఆధ్వర్యంలో నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా నమోదు కాలేదని రిటర్నింగ్ ఆఫీసర్ పేర్కొన్నారు.

మొదటి రోజు నామినేషన్లు నిల్

ఆత్మకూరు: మండలంలోని ముష్టపల్లి, కరివేన గ్రామపంచాయతీ వార్డుమెంబర్ల ఉప ఎన్నికకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. మండలంలోని ముష్టపల్లి గ్రామానికి చెందిన 1 వ వార్డు కరివేనకు చెందిన 8 వ వార్డు కు అధికారులు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

నందికొట్కూరు రూరల్ : ఖాళీగా ఉన్న వార్డు మెంబర్ ఉప ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ జారీ కావడంతో మండల పరిధిలోని నాగటూరు గ్రామంలోని 8వ వార్డుకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శోభారాణి తెలిపారు. ఈ మేరకు ఆ గ్రామ పరిధిలో మాత్రమే ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు.

రూ.25కే జాతీయ జెండా

నందికొట్కూరు: జాతీయ జెండాను ప్రజలకు 25 రూపాయలకే విక్రయిస్తున్నట్లు పోస్టాఫీసు ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం పట్టణంలోని పోస్టాఫీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంద్రాగస్టు పండుగ సంబరాలను పురస్కరించుకొని ప్రజలందరికీ జాతీయ జెండాను అందించాలనే ఉద్దేశంతోనే హర్‌ఘర్ తిరంగా 2.0 పేరిట వినూత్న కార్యక్రమానికి భారత తపాలా శాఖ శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి పోస్టాఫీసులో జాతీయ జెండాను అమ్ముతునట్లు చెప్పారు. నందికొట్కూరు సబ్ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, నందికొట్కూరు, గడివేముల, మిడుతూరు, వెలుగోడుతో పాటు అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ జెండాను రూ. 25లకే విక్రయిస్తునట్లు వెల్లడించారు. సమావేశంలో హెడ్ పోస్టుమాస్టర్ కృష్ణగౌడ్, రూపేష్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై శాంతియుత నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: మణిపూర్ ఘటనకు నిరసనగా మంగళవారం శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పాస్టర్స్ ఇవాంజలిస్ చర్చి ఎల్డర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన జరిగింది. కార్యక్రమంలో వివిధ రాజకీయ, ప్రజా, కార్మిక, దళిత, ముస్లిం, మైనార్టీ సంఘాలు పాల్గొన్నాయి. వక్తలు మాట్లాడుతూ ఆదివాసి గిరిజనులపై దాడులు చేసి, చర్చిలను తగులబెట్టడం, మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగించడం, వారిపై లైంగిక దాడులకు పాల్పడడం, ఒక వర్గానికి చెందిన వారి ఆస్తులను ధ్వంసం చేయడం పట్ల ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం బాధాకరమన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలనను విధించి మణిపూర్ ప్రజలకు రక్షణకల్పించాలని కోరారు. ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్ రాజేంద్రసింగ్ కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు బి.దానియేలు, ప్రభుదాసు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కె.నాగిరెడ్డి, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎస్ఏ జావెద్, మాల మహానాడు చందంగాలయ్య, ఎమ్మార్పీఎస్ దానియేలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకాలు

నందికొట్కూరు: తమిళనాడులోని దర్శిని కళై కోడమ్ 18వ వార్షికోత్సవం వేడుకల సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో నందికొట్కూరుకు చెందిన ఆరుగురు చిన్నారులు బంగారు పతకాలు సాధించారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆర్ట్ దేశెట్టి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతి వేసవి కాలంలో చిన్నారులకు చిత్ర లేఖనంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. మే నెలలో పిల్లలతో 100 చిత్రాలను వేయించి పోటీలకు పంపడం జరిగిందన్నారు. ఇందులో అభిజిత, చైత్ర, హేమలత, గీతాశ్రీ, రుచితా, వేదశ్రీల చిత్రలు బంగారు పతకాలకు ఎంపికయ్యాయన్నారు. ఈ నెల 8వ తేదీన మంగళవారం తమిళనాడులో దర్శిని కళై కోడమ్ నిర్వాహకులు బంగారు పతకాలు అందించారని తెలిపారు.

పుంగనూరులో ఉద్దేశ పూర్వకంగానే టీడీపీ దాడులు

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- అబ్దుల్లాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: పుంగనూరులో ఉద్దేశపూర్వకంగానే టీడీపీ దాడులకు పాల్పడిందని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. చంద్రబాబునాయుడు అధికారం కోసం ఎంత చెడ్డకైనా ఒడిగడతాడని, 2024లో కూడా ఓటమి తప్పదని చంద్రబాబుకు అర్థం కావడంతో మరింత బరితెగించారని చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ జీవితం, 14 ఏళ్ల సీఎం పదవి, 15 ఏళ్ల విపక్షనేత అని చెప్పుకుంటూ తిరుగుతాడని, ఎంత అనుభవం ఉంటే మాత్రం ఏం లాభం పుంగనూరులో మరీ బరి తెగించాలా అని ప్రశ్నించారు. మంగళవారం అబ్దుల్లాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా పర్యటించి ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ..ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి స్థానికుల సమస్యలు పరిష్కరించారు.

పక్కా స్కెచ్‌తోనే అల్లర్లు

ఎమ్మెల్యే మాట్లాడుతూ... పుంగనూరులో చంద్రబాబు పక్కాగా స్కెచ్ వేసుకుని వచ్చారని, నిజానికి అక్కడ ముందుగా కార్యక్రమమే లేదన్నారు. ముందురోజు అక్కడ రాళ్లు, కర్రలు దాచారని, లేకపోతే హఠాత్తుగా పోలీసుల మీద వాటితో ఎలా దాడి చేయగలరని ప్రశ్నించారు. అంటే రెక్కీ చేసి, ముందు రోజూ అక్కడ వాటిని దాచి పెట్టారా అని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదు అని ధ్వజమెత్తారు. చంద్రబాబు హయాంలో ఒక్క ప్రాజెక్టూ కట్టలేదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 9 ఏళ్లు ఏకాలం సీఎంగా పనిచేసిన ఆయన ఎన్నికల సమయంలో ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి, కమీషన్ తీసుకొని వెళ్తాడని ఆరోపించారు. జలయజ్ఞం కింద లక్ష కోట్లు ఖర్చు చేసి 70 శాతం ప్రాజెక్టుల పనులు పూర్తి చేసిన ఘనత వైఎస్ రాజశేఖర రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వర రెడ్డి, మాజీ చైర్మన్ వంగాల వెంకట్రామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, నాయకులు రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు


కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ లవన్న, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

కొత్తపల్లి ఎంపీటీసీకి సిద్ధార్థరెడ్డి పరామర్శ

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీటీసీ మొల్ల అలీ బాషా కుటుంబాన్ని మంగళవారం శాప్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పరామర్శించారు. ఎంపీటీసీ తల్లి జెబున్ బీ(52) సోమవారం రాత్రి గుండె నొప్పితో బాధపడుతూ నిద్రలోనే మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న సిద్ధార్థ రెడ్డి కొత్తపల్లికి చెరుకొని కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికిపూల మాలవేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ అలీబాషాకు ధైర్యం చెప్పారు. అలాగే కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్ ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అదేవిధంగా పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు నివాళులర్పించారు.

బైకు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

కొత్తపల్లి: టీవీఎస్ ఎక్సెల్ బైకుపై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి విద్యార్థికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ప్రశాంతి, ప్రతాప్ దంపతుల పెద్దకుమారుడు గనికుమార్, దీపక్ అనే పదో తరగతి చదువుతున్న ఇంకో విద్యార్థితో కలసి తాగునీటి కోసం టీవీఎస్ ఎక్సెల్ బైకుపై ఊరిబయటి చేతిపంపు దగ్గరుకు వెళ్లారు. ఇద్దరు అక్కడినుంచి తిరిగివస్తూ అదుపుతప్పి చెట్టుకు గుద్దారు. దీంతో గనికుమార్‌కు తీవ్రగాయాలై స్పృహకోల్పోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతనిని ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని కర్నూలుకు తీసుకు వెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కర్నూలుకి తరలించారు.

వాల్మీకుల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం


గాజులపల్లెలో మాట్లాడుతున్న కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

మహానంది: వాల్మీకులు, బీసీల అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళ్తూ గాజులపల్లెలోని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జయరాం ఇంట్లో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ బీసీలలో ముఖ్యంగా వాల్మీకుల అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగా రాష్ట్రంలో రెండు ఎమ్మెల్సీలు, ఒక మంత్రి, 108 మందికి డైరెక్టర్లుగా అవకాశం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రిగా సీఎం జగన్ నిలిచారని కొనియాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర స్థాయిలో చర్చించేందుకు అన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులి కొండన్న, జిల్లా అధ్యక్షుడు మీనిగ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొండా మధుసూధన్‌రెడ్డి, ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జయరాం, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నరహరి, సర్పంచ్ గడ్డం చంటి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటరమణ, రాష్ట్ర నాయకులు శీలం ఎర్ర ఓబులపతి, మౌళాలి, తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు వాల్మీకులు తమ సమస్యలను మంత్రి జయరాం దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మహానంది: ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బండిఆత్మకూరు ఎంపీపీ సంజీవ రెడ్డి సూచించారు. మంగళవారం బండిఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు, భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పుల్లారెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

మిడుతూరు: మండల పరిధిలోని బైరాపురం గ్రామానికి చెందిన మహబూబ్ బాషా సోమ వారం సహజ మరణం చెందారు. ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద నామిని అయిన భార్య నసిమూన్ బీకి రూ. 10 వేలను గ్రామ ఉపసర్పంచ్ సుబ్బారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఫరీద్ అహమ్మద్, వెల్ఫేర్ అసిస్టెంట్ త్రివేణి, వలంటీర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెలుగోడు: వెలుగోడు–నంద్యాల ప్రధాన రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బోయరేవుల– మోతుకూరు గ్రామాల మధ్య ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో సంతజూటూరుకు చెందిన ఇద్దరు, మోతుకూరుకు చెందిన ఒకరు గాయపడినట్లు సమాచారం.

పొలంబడితో అధిక దిగుబడి


రైతులకు సాగులో మెలకువలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పొలంబడి కార్యక్రమంలో రైతులు సాగులో మెలకువలు తెలుసుకొని అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం నంద్యాల వ్యవసాయ అధికారి హేమలత అన్నారు. మంగళవారం ఏఓ కె.మహేష్ ఆధ్వర్యంలో నందికుంట గ్రామ శివారులోని పత్తిపంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పర్యావరణ విశ్లేషణ చేసి బ్యాలెట్ బాక్స్ టెస్ట్ చేశారు. ఆమె మాట్లాడుతూ నీటి ముంపునకు గురైన పత్తి పంటలో ఎకరానికి 30 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు. అంతర కృషి చేసిన తర్వాత 19.19.19 లేదా 28.28.0 లీటర్ నీటికి 10గ్రాముల చొప్పున, అలాగే పత్తి పంటలో మెగ్నీషియం లోప నివారణకు 15 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలాని చెప్పారు. అదేవిధంగా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఎకరానికి 80గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును పిచికారీ చేసుకోవాలని రైతులకు వివరించారు. గ్రామవ్యవసాయ సహాయకుడు శివకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇంటర్వ్యూలు

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వలంటీర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని కరివేన, శ్రీశైలం మండలంలోని సున్నిపెంట, శ్రీశైలంలో ఖాళీగా ఉన్న 7 పోస్టులకు 12 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది మోహన్‌కుమార్, కల్యాణ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు సెలవులు ప్రకటించాలి

పగిడ్యాల: కళ్ల కలక వైరస్ బారినపడి అల్లాడిపోతున్న కస్తూర్బా పాఠశాల విద్యార్థినుల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాలకు వారం రోజులు సెలవులు ప్రకటించాలని ఏఐఎస్‌ఎఫ్ తాలూకా సహాయ కార్యదర్శి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో దాదాపు 50 మంది విద్యార్థినులు కళ్ల కలక వైరస్ బారినపడి విలవిలలాడిపోతున్నా ఎస్ఓ ఉష పట్టించుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. విద్యార్థినీల ఆరోగ్యాన్ని పర్యవేక్షించిన వైద్యాధికారి మోహన్ పాఠశాలకు కనీసం వారం రోజులు సెలవులు ప్రకటించాలని ఎస్ఓకు సూచించినా, ఆమె సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.